# 31. గురుభక్తి

హిమాలయాల్లోని ఓ కొండ గుహలో ఓ గురువు కొందరు శిష్యులతో కలిసి జీవిస్తున్నాడు. ఓ రోజు గుహలోంచి బయటకి వెళ్ళిన గురువు వెంటనే లోపలకి వచ్చి శిష్యులతో చెప్పాడు.

"ఆకాశంలో ఓ ఎద్దు ఎగురుతూ వెళ్ళడం ఇప్పుడే చూసాను. దానికి రెక్కలు కూడా లేవు."

"మేం పిచ్చివాళ్ళలా కనిపిస్తున్నామా స్వామీ? మేమెవరం అది నమ్మం." చెప్పారు శిష్యుల్లో చాలామంది.

వెంటనే వాళ్ళల్లోని ఓ శిష్యుడు తన సహ శిష్యులతో చెప్పాడు.

"గురువు గారు చెప్పింది నేను నమ్ముతాను. మన గురువు అబద్ధమాడాడని నమ్మేకంటే, రెక్కలు లేని ఎద్దు ఆకాశంలో ఎగిరిందని నమ్మడమే నాకిష్టం."

# 32. దైవ ప్రార్థన ఎందుకు చెయ్యాలి?

"ఏం చేస్తున్నావు?"

"ప్రార్థన."

"ఏమని?"

"నాకు ప్రమోషన్ ఇప్పించమని, మా అమ్మాయికి అమెరికన్ వీసా రావాలని, అమెరికాలోని మా అబ్బాయికి మంచి ఉద్యోగం ఇప్పించమని... ఇంకా ఆయన మరిచిన ఇలాంటివే కొన్ని."

"భగవంతుడు ఇవ్వనివాటిని ఆయనకి గుర్తు చేయడం కాదు ప్రార్థన అంటే. ఆయన ఎన్నటికీ ఏదీ మరవడు. మనకి అర్హత, అవసరం వున్న మటుకే ఏదైనా ఆయనిచ్చేది."

"మరయితే ఇంక దేవుణ్ని ప్రార్థించడం దేనికి?"

"ఆయన ప్రసాదించిన, మనకి అర్హత, అవసరం ఉన్న అనేకమైన వాటికి కృతజ్ఞతలు తెలియచేయడానికి దైవ ప్రార్థన చేయాలి."

## 33. హేండ్ బేగ్

ఆ రోజు హనుమజ్జయంతి కాబట్టి ఆంజనేయస్వామి గుడి కిటకిటలాడుతోంది. గుడికి వచ్చిన ఓ యువతి ఆకుపూజ చేయించింది. బయటకి వచ్చి ఆటో ఎక్కాక, ఆమెకి తన హేండ్ బేగ్‌ని గుళ్ళో మరిచిపోయిన సంగతి జ్ఞాపకం వచ్చింది. ఆటో దిగి గుళ్ళోకి పరిగెత్తుకెళ్ళి చూస్తే అది కనిపించలేదు. ఎవర్నడిగినా తమకి తెలీదంటే తమకి తెలీదన్నారు.

ఆమె గుళ్ళోని హనుమంతుడి విగ్రహాన్ని చూస్తూ ఆక్రోశంగా అడిగింది.

"నువ్వు దొంగల్ని కూడా నీ భక్తులుగా స్వీకరిస్తావన్న మాట."

వెంటనే హనుమంతుని విగ్రహంనించి ఈ మాటలు వినపడ్డాయి.

"కాదు. నా భక్తుల్లో ఒకరు ఆ హేండ్‌బేగ్‌ని చూసి, తమ ప్రార్థన ఫలించిందనుకుని సంతోషంగా తీసుకెళ్ళారు."

## 34. ఆనంద స్వరూపుడు

"స్వామీ. అంతా మీరు జీవన్ముక్తులంటారు. ఇది నిజమేనా?"

"అవును."

"మీరూ నాలానే ఉన్నారు. మీకూ నాకు పెద్ద తేడా ఏమీ కనిపించడం లేదు. మీలోని ప్రత్యేకత ఏమిటి?"

"నువ్వు ఎప్పుడూ ఏదో ఒకటి కోరుకుంటూంటావు. అది నీకు లభిస్తే నువ్వు ఆనందంగా ఉంటావనుకుంటావు. అది లభించిన తర్వాత నీకు కలిగే ఆనందం త్వరలోనే మటు మాయమౌతూంటుంది. నా విషయంలో అలా కాదు. ఆనందం లభించడానికి నేనేం కోరుకోను. ఎందుకంటే నేనెప్పుడూ ఆనందంగానే ఉంటాను. ఇదే నీకు నాకు గల తేడా."